RNI NO: TELTEL2023/46567

# అక్షర వేదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల పక్షం

AKSHARA VEDAM TELUGU DAILY

**విలేకరులు కావలెను**

తెలంగాణ ప్రాంతం అన్ని జిల్లాల నుండి స్టాప్ రిపోర్టర్లు, జిల్లా ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు అర్జెంటుగా కావలెను అనుభవం ఉన్నా లేకున్నా తీసుకోబడును

చీఫ్ ఎడిటర్ -పందిళ్ల రవీందర్ (9030653934)

ఎడిటర్ -పొన్నం ప్రసాద్ గౌడ్

9666992524

Published at Karimnagar circulated in : Telangana | సంచిక : 363 | సంపుటి : 02 | సోమవారం 24-11-2025 | పేజీలు -8 | వెల: రూ. 05.00

- స్వర్ణ రథంపై సత్య సాయి చిత్రపటానికి ఊరేగింపు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- హాజరైన ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన, ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత రెడ్డి తదితరులు

# ఘనంగా సత్యసాయి శతజయంతి







## పుట్టపర్తిలో మార్మోగిన సాయినామం

**పుట్టపర్తి, నవంబర్ 23( అక్షర వేదం**

సత్యసాయి నామస్మరణతో పుట్టపర్తి మార్మోగింది. పట్టణ వీధులన్నీ కిటకిటలాడాయి. ప్రశాంతి నిలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. హిల్‌వ్యూ స్టేడియంలో సాంస్కృతిక సంబరాలు అంబరాన్నంటాయి. సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. స్వర్ణరథంపై సత్యసాయి బాబా చిత్రపటాన్ని ఊరేగించారు. సత్యసాయి స్వర్ణరథం స్టేడియంలోకి వస్తుండగా గాయకుడు మనో తన పాటతో అరవిందు డోలు వాయిద్యంతో సాగింది. గాయకుల పాటకు భక్తులు లీనమై పులకించిపోయారు. శాంతి వేదిక వరకు సాగిన స్వర్ణ రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు ఎగబడ్డారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారాచంద్రబాబునాయుడు, రేవంతరెడ్డితోపాటు దేశవిదేశాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

-మిగతా 2 లో



# ఇబ్బందులకు తావివ్వొద్దు

## ప్రతిష్టాత్మకంగా గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు ఉండాలి

- కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోండి
- పోలీసులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను ఆదివారం సీఎం పరిశీలిన



**హైదరాబాద్ నవంబర్ 23( అక్షర వేదం**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 8,9 తేదీల్లో రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించబోయే గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను ఆదివారం సీఎం పరిశీలించారు. పోలీసులు, సంబంధిత అధికారులతో ఈ సందర్భంగా ఆయన సమీక్ష నిర్వహించారు. "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రపంచ వ్యాప్తంగా ప్రతినిధులు హాజరవుతారు.

-మిగతా 2 లో



# 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్..

- సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ నేడు ప్రమాణం
- ముగిసిన గవాయ్ పదవీకాలం

**న్యూఢిల్లీ**

భారత సుప్రీం కోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ సోమవారం ప్రమాణం చేయనున్నారు. అనంతరం సీజేఐగా బాధ్యత లు చేపట్టనున్నారు. 2027 ఫిబ్రవరి 9 వరకు ఆ బాధ్యతల్లో కొనసాగనున్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టబోతున్న తొలి హర్యానా వాసిగా జస్టిస్ సూర్యకాంత్ రికార్డు సృష్టించనున్నారు. జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హర్యానాలోని హిస్సార్ జిల్లాలో జన్మించారు. 1981లో డిగ్రీ పూర్తి చేశారు. 1984లో రోహ తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీ నుంచి న్యాయ శాస్త్ర పట్టా పొందారు. అదే సంవత్సరం హిస్సార్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా సాధన ప్రారంభించారు. 1985లో పంజాబ్ హర్యానా హైకోర్టుకు మారారు. 2001లో సీనియర్ న్యాయవాది హోదా పొందారు. 2004 జనవరి 9న పంజాబ్ హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యేంత వరకూ హర్యానా అడ్వకేట్ జనరల్‌గా పని చేశారు. 2018 అక్టోబరు 5న హిమాచల్

-మిగతా 2 లో




# టిమ్స్‌లో వైద్యసేవలు అందేదెప్పుడు..

- తేదీ ప్రకటించి నెలరోజులైనా నిర్లక్ష్యమెందుకు?
- కోతల సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం ఏంటి?
- డేట్లు, డెడ్‌లైన్లు మార్చడం తప్ప చేస్తున్నదేంటి?
- సత్వరమే వైద్యసేవలను అందుబాటులోకి తేవాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, నవంబర్ 23( అక్షర వేదం**

: 'నెలరోజుల్లో సనత్‌నగర్ టిమ్స్‌లో వైద్యసేవలు ప్రారంభమవుతాయని అక్టోబర్ 23న ప్రకటించిన సీఎం రేవంత్ నిన్నటితో నెల దాటినా పట్టించుకోవడంలేదెందుకు? ఇప్పటికైనా ప్రారంభిస్తారా? ఎప్పటిలాగే దాటేసి మరో తేదీ ప్రకటిస్తారా? కోతల ముఖ్యమంత్రీ.. దీనికి మీ సమాధానం ఏమిటీ?' అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో గప్పాలు కొట్టడం తప్ప, టిమ్స్ దవాఖానలను

-మిగతా 2 లో




# 26న మరో తుఫాన్..

- బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం
- 24గంటల్లో వాయుగుండంగా మారనున్న తీవ్ర అల్పపీడనం
- వెల్లడించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం

**హైదరాబాద్, నవంబర్ 23( అక్షర వేదం**

మలక్కా జలసంధి దానికి ఆనుకుని ఉన్న అండమాన్‌లో ఏర్పడిన అల్పపీడనం ఆదివారం ఉదయం తీవ్ర అల్పపీడనంగా మారింది. ఈ క్రమంలో సోమవారం పశ్చిమ, ఉత్తర దిశగా కదిలి ఆగ్నేయ బంగాళాఖాతంలో దీనికి ఆనుకుని ఉన్న దక్షిణ అండమాన్ మీదుగా వాయుగుండంగా మారే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇది పశ్చిమ-ఉత్తర దిశగా మరింత కదులుతూ, రాబోయే 48గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో తుపానుగా మారే అవకాశం ఉన్నదని అంచనా వేసింది.

-మిగతా 2 లో



# సముద్రంలో తేలియాడే కృత్రిమ ద్వీపం

- చైనాలో ప్రపంచంలోనే మొట్టమొదటి నిర్మాణం
- అణు పేలుళ్లను తట్టుకునేలా రూపకల్పన
- 2028 నాటికి సిద్ధంచేసేలా కసరత్తు


**బీజింగ్**

నూతన ఆవిష్కరణలతో దూసుకుపోతున్న చైనా మరో వినూత్న ప్రయోగానికి నాందిపలికింది. ప్రపంచంలోనే మొట్టమొదటిగా సముద్రంలో తేలియాడే కృత్రిమ ద్వీపం నిర్మాణానికి సిద్ధమైంది. ఈ ద్వీపం అణు పేలుళ్లను తట్టుకునేలా రూపకల్పన చేస్తోంది. సముద్రం మధ్యలో ద్వీపాలు సర్వసాధారణమే. కానీ చైనా డిజైన్ చేసిన ఈ ద్వీపం 125 అడుగుల పొడవు, 279 అడుగుల వెడల్పుతో, 78,000 టన్నుల బరువుతో అత్యంత బలమైన పెను తుపానులను తట్టుకునేవిధంగా నిర్మించనుంది. సముద్రజలాల మట్టానికి 45 మీటర్ల ఎత్తులో ఉండేవిధంగా డిజైన్ చేశారు. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ (ఎస్‌సిఎంపి) నివేదిక ప్రకారం.. అణు విస్ఫోటనాన్ని తట్టుకునేలా ప్రపంచంలోనే మొట్టమొదటి తేలియాడే కృత్రిమ ద్వీపాన్ని చైనా నిర్మిస్తోంది. సెమీ-సబ్‌మెర్సిబుల్ ప్లాట్‌ఫామ్ కలిగి ఉండి, దీర్ఘకాలిక లోతైన సముద్ర

-మిగతా 2 లో

# వాయు కాలుష్యంపై ఆగ్రహజ్వాలలు

- బీజేపీ పాలిత ఢిల్లీలో మళ్లీ ప్రజల ఆందోళన..
- పోలీసులపై పెప్పర్ స్ప్రే



**న్యూఢిల్లీ నవంబర్ 23( అక్షర వేదం**

బీజేపీ ట్రిపుల్ ఇంజిన్ సర్కారు పాలిస్తున్న ఢిల్లీలో వాయుకాలుష్యం తీవ్ర స్థాయికి చేరడంతో ప్రజలు నిరసనలకు దిగుతున్నారు. ఆదివారం చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతలకు దారితీసింది. ఆందోళన చేస్తున్న వారిని తొలగించడానికి ప్రయత్నించిన పోలీసులపై కొందరు పెప్పర్ స్ప్రే చల్లడంతో ముగ్గురు నలుగురు గాయపడ్డారు. వారిని రామ్ మనోహర్


-మిగతా 2 లో

# కేంద్ర పాలిత ప్రాంతంగా చండీగఢ్!

- బిల్లుపై ప్రతిపక్షాల ఆగ్రహం
- తుది నిర్ణయం తీసుకోలేదన్న కేంద్ర హోం శాఖ

**న్యూఢిల్లీ నవంబర్ 23( అక్షర వేదం**

పంజాబ్, హర్యానా సంయుక్త రాజధాని చండీగఢ్‌లో చట్టాలు చేసే అధికారాన్ని రాష్ట్రపతి పరిధిలోకి తీసుకొచ్చే రాజ్యాంగ అధికరణ 131 సవరణ బిల్లు పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రప్రభుత్వం చేసిన ప్రకటనపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కేంద్రంలో అధికారంలోకి వచ్చిననాటి నుంచి సమాఖ్య స్ఫూర్తిని నిర్వర్యం చేస్తూ వచ్చిన



-మిగతా 2 లో

# 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్..

మొదటి తరువాయి



ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2019 మే 24వ తేదీన సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.రెండు దశాబ్దాలుగా వివిధ ధర్మాసనాల్లో పని చేసిన జస్టిస్ సూర్యకాంత్ పలు కీలక తీర్పుల్లో భాగస్వామిగా ఉన్నారు. ఆర్టికల్ 370 రద్దుపై తీర్పు ఇచ్చిన ధర్మాసనంలో ఆయన ఉన్నారు. దీంతోపాటు వాక్‌స్వాతంత్ర్యం, అవినీతి, బీహార్ ఓటర్ల జాబితా, పర్యావరణం, లింగసమానత్వం వంటి అంశాల్లో ఆయన కీలక తీర్పులను వెలువరించారు.

# టిమ్స్‌లో వైద్యసేవలు అందేదెప్పుడు..

మొదటి తరువాయి



అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మీరు చేస్తున్న కృషి శూన్యం అని ఆదివారం ఎక్స్ వేదికగా విమర్శించారు. టిమ్స్ దవాఖానల విషయంలో రెండేండ్లుగా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. డేట్లు, డెడ్‌లైన్లు మార్చడం తప్ప ముఖ్యమంత్రి చేస్తున్నదేమీలేదని దుయ్యబట్టారు. ప్రభుత్వ భూములను తెగనమ్మడంపై ఉన్న శ్రద్ధ, ప్రజలకు వైద్యసేవలు అందించే వైద్యశాలలపై లేకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. నత్తనడకన సా గుతున్న సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్ దవాఖానల నిర్మాణ పనుల నిర్వహణలో సర్కారు తీరు చూస్తుంటే నత్త కూడా ఆత్మహత్య చేసుకుంటుందేమోనని ఎద్దేవా చేశారు.

# 26న మరో తుఫాన్..

మొదటి తరువాయి

దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.దీంతోపాటు పలు ప్రాంతాల్లో చలి తీవ్రత కూడా పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నది. గత మూడ్రోజులుగా సింగిల్ డిజిట్‌కు పరిమితమైన ఉష్ణోగ్రతలు.. రెండురోజుల నుంచి స్వల్పంగా పెరిగినట్టు తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, సంగారెడ్డి, వికారాబాద్, జగిత్యాల, కామారెడ్డి జిల్లాల్లో 15 డిగ్రీలలోపు రాత్రి కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు పేర్కొన్నది. అత్యల్పంగా రాత్రి ఉష్ణోగ్రతలు కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్‌లో 11.6 డిగ్రీలుగా నమోదైనట్టు వెల్లడించింది.

# వాయు కాలుష్యంపై ఆగ్రహజ్వాలలు

మొదటి తరువాయి



లోహియా దవాఖానకి తరలించారు.అధ్వాన గాలి నాణ్యతను మెరుగుపర్చడానికి చర్యలు తీసుకోవాలని కొందరు పౌరులు ఆదివారం ఇండియా గేట్ వద్ద ఆందోళన చేశారు. అయితే అక్కడ అందోళనకు అనుమతి లేదంటూ పోలీసులు వారిని పంపించేశారు. దాంతో వారు సీ–హెక్సాగాన్ ప్రాంతానికి వెళ్లి అక్కడ ఉన్న బారికేడ్లను తొలగించడానికి ప్రయత్నించారు. తర్వాత రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తుండగా, వారిని తొలగించడానికి ప్రయత్నించిన పోలీసులపై హఠాత్తుగా పెప్పర్ స్ప్రే చల్లారు. ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# ఘనంగా సత్యసాయి శతజయంతి

మొదటి తరువాయి

ఉదయం హిల్ వ్యూ స్టేడియంలో ప్రముఖ గాయకుడు మనో, శివమణి సంగీత విభావరితో అలరించారు. అన్నిరాష్ట్రాల సత్యసాయి భక్త బృందాలు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాయి. సింగర్ మనో పాట పాడుతుండగా.. సత్యసాయి స్వర్ణరథం స్టేడియంలోకి ప్రవేశించింది. దీంతో భక్తుల సాయినామంతో స్టేడియం దద్దరిల్లింది. సాయి రథం ముందు వేదపారాయణం చేస్తూ సాగారు. వేదం, నగర సంకీర్తన, భజన ఒకే వేదికపై ఆధ్యాత్మికత, ఏకత్వాన్ని ప్రతిబింబించాయి. స్వర్ణ రథంపై దివ్యకాంతులతో విరాజిల్లుతున్న సత్యసాయి బాబా దర్శనంతో భక్తులు తన్మయత్వం పొందారు.

**సాయి కుల్వంతులో..**

సత్యసాయి శత జయంతి వేడుకలను ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత సభామండపంలో ఘనంగా నిర్వహించారు. సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు



చేశారు. విద్యార్థుల వేదపఠనం, భక్తి నివేదనం పేరిట భక్తి గీతాల ఆలాపన చేపట్టారు. వేలాది మంది భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ప్రశాంతి నిలయం పూర్తిగా నిండిపోయింది. అందులో చోటులేక బయటే భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది. పుట్టపర్తి వీధులు కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సెంట్రల్ ట్రస్టు సభ్యులు, సేవాదళ్, జిల్లా అధికార, పోలీసు యంత్రాంగం అన్ని చర్యలు తీసుకున్నాయి. దీంతో బాబా శతజయంతి ఉత్సవాలు దిగ్విజయంగా ముగిశాయి. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు నారాయణ సేవతోపాటు పలువురు భక్తులు అన్నదానం చేశారు.

**ఊపిరి పీల్చుకున్న యంత్రాంగం**

ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో జిల్లా యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. వేడుకల మొదటి రోజు నుంచి ప్రముఖులు సందర్శిస్తున్నారు. దీంతో భద్రత కల్పించడం పోలీసు శాఖకు సవాల్‌గా మారింది. కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్ నిరంతరం జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ.. గడిపారు.

# ఇబ్బందులకు తావివ్వొద్దు

మొదటి తరువాయి

వివిధ దేశాల అంబాసిడర్లు కూడా పాల్గొనే అవకాశం ఉంది. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు రావొద్దు.పాస్‌లు లేకుండా ఎవరు ఎంట్రీ కావడానికి వీలు లేదు. సమ్మిట్‌కు సంబంధం లేని వారికి ఎట్టి పరిస్థితుల్లో అనుమతి లేదు. శాఖల వారీగా అధికారులకు ఎంట్రీ ఉంటుంది. ఏర్పాట్లను నేను ఎప్పటికప్పుడు పరిశీలిస్తాను. పోలీస్‌లు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. పార్కింగ్‌కు ఇబ్బంది రావొద్దు. బందో బస్తుకు వచ్చే పోలీస్ సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలి. సమ్మిట్‌కు హాజరయ్యే మీడియాకు తగిన ఏర్పాట్లు చేయాలి” అని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో నిర్మిస్తున్న భారత్ స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి ఆయన తెలుసుకున్నారు.

**2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ**



రాష్ట్ర భవిష్యత్ చిత్రపటాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా, అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ సమ్మిట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి రెండేండ్లు పూర్తవుతున్న సందర్భంగా రెండు రోజుల పాటు ఈ వేడుకలను నిర్వహించనున్నట్టు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. తొలిరోజు ప్రభుత్వం సాధించిన విజయాల వివరాలను ప్రదర్శిస్తారు. రెండో రోజు తెలంగాణ రైజింగ్ – 2047 విజన్ డాక్యుమెంట్‌ను ప్రభుత్వం ఆవిష్కరించనుంది. ఈ ఈవెంట్ కు పారిశ్రామిక వేత్తలు, బడా కంపెనీల ప్రతినిధులు తరలిరానున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. దేశ విదేశాల నుంచి దాదాపు రెండు వేల మంది ప్రముఖులు హాజరుకానున్నట్టు సర్కార్ అంచనా వేస్తోంది. తెలంగాణ రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను మరింత పెంచడం, రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడం సమ్మిట్ ముఖ్య ఉద్దేశం. అంతర్జాతీయ స్థాయిలో తన విజన్, పాలసీలను ప్రదర్శించడానికి సమ్మిట్ ముఖ్య వేదిక కానుందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో ఏర్పాట్లు సైతం అదే రీతిలో ఉండేలా అన్ని చర్యలు చేపట్టింది.

# సముద్రంలో తేలియాడే కృత్రిమ ద్వీపం

మొదటి తరువాయి

పరిశోధనలకు అనువుగా రూపొందించబడింది. ఇది 2028లో వినియోగంలోకి వస్తుందని భావిస్తున్నారు.

**ఎన్నో ప్రత్యేకతలు..**

ఈ కృతిమ ద్వీపంలో ఎన్నో ప్రత్యేకతలున్నాయి. సాధారణ నౌకల కంటే 15 నాట్ల వేగంతో ప్రయాణిస్తుంది. దీనిలో 300 మందికిపైగా నాలుగు నెలలపాటు సకల సౌకర్యాలతో ఉండొచ్చు. అణుబాంబులతో వచ్చే షాక్ వేవ్‌లను, తుఫాన్లను తట్టుకునేవిదంగా ప్రత్యేకమైన మెటామెటీరియల్స్‌తో ‘శాండ్‌విచ్ బల్క్‌హెడ్’ రూపంలో నిర్మించనున్నారు. దీర్ఘకాలం సముద్రంలో సేవలందించే విధంగా తయారుచేయనున్నారు. ఇది సముద్ర లోతుల్లో దాగి ఉన్న ఖనిజాలను గుర్తించగలదు. సముద్రగర్భంలో దాగి ఉన్న రహస్యాల



గుట్టువిప్పనుంది. సైన్యానికి కమాండ్ సెంటర్‌గా, శత్రు కదలికలను గుర్తించే నిఘా కేంద్రంగా కూడా పని చేయనుంది. ఈ ద్వీపం 2028 నాటికి అందుబాటులోకి వస్తే చైనా బ్లూ ఎకానమీలో, వాతావరణ మార్పుల అధ్యయనంలో , సముద్ర పరిశోధనలో మరింత ముందుకు వెళ్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# కేంద్ర పాలిత ప్రాంతంగా చండీగఢ్!

మొదటి తరువాయి

బిజెపి ప్రభుత్వం వివిధ రూపాల్లో రాష్ట్రాల హక్కులను, అధికారాలను గుంజేసుకొని తన గుప్పిట్లో పెట్టుకుంటోంది. అదే క్రమంలో జమ్ముకాశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతాలుగా ముక్కలు చేసి..రాష్ట్ర హోదా హామీ నెరవేర్చకుండా మీనమేషాలంటూ దాటవేస్తోంది. అదే తరహా కుటిల వ్యూహాన్ని ఇప్పుడు ప్రశాంతంగా ఉన్న పంజాబ్‌లోనూ అమల్జేసేందుకు మోడీ సర్కార్ పూనుకుంటోందని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సర్వత్రా ఆగ్రహావేశాలు పెల్లుబికిన నేపథ్యంలో.. ఆ ప్రతిపాదనపై తుది నిర్ణయం తీసుకోలేదని, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం లేదని ఆదివారం కేంద్ర హోం మంత్రిత్వశాఖ ప్రకటించింది. కేంద్ర పాలిత ప్రాంతాలకు వర్తించే ఆదేశాలు, చట్టాలను నేరుగా చేసే అధికారాలను రాష్ట్రపతికి కల్పించిన రాజ్యాంగ అధికరణం 240 పరిధిలోకి చండీగఢ్‌ను తీసుకురావాలని కేంద్రం ప్రతిపాదించింది. త్వరలో జరగనున్న శీతాకాల సమావేశాల్లోనే ఈ అంశంపై బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నట్లు శనివారం ప్రకటించింది. చట్టసభల్లేని కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్–నికోబార్ దీవులు, దాద్రా–నగర్ హవేలీ, దమణ్–దీవ్ ప్రస్తుతం అధికరణం 240 పరిధిలో ఉన్నాయి. ఈ అధికారణం పరిధిలోకి చండీగఢ్‌ను తీసుకువచ్చే బిల్లు ఆమోదం పొందితే రాష్ట్రపతికి చండీగఢ్‌లో చట్టాలు చేసే అధికారం ఉంటుంది. దీంతో ఆమ్ ఆద్మీపార్టీ, కాంగ్రెస్, అకాలీదళ్ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం పంజాబ్ రాజధానిని లాక్కోవడానికి ప్రయత్నిస్తోందని పంజాబ్ ముఖ్యమంత్రి, ఆప్ నాయకులు భగవంత్ మాన్ విమర్శించారు. చండీగఢ్ గతంలోనూ, ప్రస్తుతం, భవిష్యత్తులోనూ పంజాబ్‌తో విడదీయరాని భాగమేనని పేర్కొన్నారు. ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కూడా పంజాబ్ గుర్తింపుపై కేంద్రం దాడి చేస్తోందని విమర్శించారు. చండీగఢ్ పంజాబ్‌కు చెందినదేనని, దానిని లాక్కోవడానికి చేసే ప్రయత్నాలకు తీవ్ర ప్రతికూల పరిణామాలు ఉంటాయని పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ అమరీందర్ సింగ్ పేర్కొన్నారు. అకాలీదళ్ నేత సుఖ్‌బీర్‌సింగ్ బాదల్ కూడా దీనిని పంజాబ్ వ్యతిరేక బిల్లుగా అభివర్ణించారు. మొదట ప్రకటించడం, ఆ తరువాత ఆలోచిస్తున్నామనడం కేంద్ర ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇన్‌ఛార్జి (కమ్యూనికేషన్స్) జైరామ్ రమేష్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చండీగఢ్ పరిపాలనకు సంబంధించి ఎలాంటి బిల్లును ప్రవేశపెట్టే ఉద్దేశం కేంద్రానికి లేదని కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించిన కేంద్రప్రభుత్వ చట్టం రూపొందించే ప్రక్రియను సరళీకరించాలన్న ప్రతిపాదన ఇంకా పరిశీలనలో ఉందని పేర్కొంది. 1966లో పంజాబ్ నుంచి హర్యానా విడిపోయిన తర్వాత చండీగఢ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించారు. పంజాబ్, హర్యానాకు అప్పటి నుంచి చండీగఢ్ ఉమ్మడి రాజధానిగా కొనసాగుతోంది. ప్రస్తుతం పంజాబ్ గవర్నర్ చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్‌గా పాలన నిర్వహిస్తున్నారు.

# అంబేద్కర్ ఆశయ సాధనే మనం ఇచ్చే ఘన నివాళి

**- జ్ఞాన మాల కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్**




**అక్షర వేదం/మేడ్చల్ మల్కాజిగిరి/మేడిపల్లి: బోడుప్పల్,నవంబర్ 23,**
నవ భారత రాజ్యంగా నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అయన చూపిన మార్గంలో మనందరం నడవడమే ఆయనకు మనం ఇచ్చే గొప్ప నివాళి అని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఆదివారం నాడు బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో అంబేద్కర్ అశయ సాధన సమితి అధ్వర్యంలో నిర్వహించిన 353 వ జ్ఞాన మాల కార్యక్రమంలో పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ఈ దేశంలోని అన్ని వర్గాలకు హక్కులు, ఆత్మగౌరవం కావాలని దానికి భారత రాజ్యంగమే మార్గదర్శకం కావాలని బలంగా వాదించిన మహోన్నతమైన వ్యక్తి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ అశయ సాధన సమితి అధ్యక్షుడు నత్తి మైసయ్య బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి,కీసర గుట్ట డైరెక్టర్ రాపోలు శంకరయ్య,మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ బొమ్మకు కళ్యాణ్,సుమన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు. దానగళ్ళ యాదగిరి,జై రాములు, రాపోలు ఉపేందర్,రాపోలు రామ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# పుట్టపర్తి సత్యసాయి బాబా జయంతి ఉత్సావాల్లో పాల్గొన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

**-ఘనంగా స్వాగతం పలికిన ఏపీ రెవిన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్**
**-అంగరంగ వైభవంగా జరిగిన సత్యసాయి బాబా 100వ జయంతి వేడుకలు**
**-ఎంతో మంది జీవితాల్లో సత్యసాయి బాబా వెలుగులు నింపారన్న సీఎం రేవంత్ రెడ్డి**



**అక్షర వేదం/హైదరాబాద్ మహీపాల్ రెడ్డి, ప్రత్యేక ప్రతినిధి, నవంబర్ 23**
భగవాన్ సత్యసాయి బాబా 100వ జయంతి ఉత్సవాలు పుట్టపర్తిలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు మంత్రులు, వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖ నాయకులు, పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులు, సినీ ప్రముఖులు పాల్గొన్నారు.ప్రత్యేక ఆహ్వానం అందుకున్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం సత్యసాయి బాబా జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఏపీ రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పుష్పగుచ్చాలతో ఘనంగా స్వాగతం పలికి... శాలువాతో సన్మానించారు.సీఎం రేవంత్ రెడ్డి సత్యసాయి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి... బాబా సేవా ధర్మాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా... సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ...సత్యసాయి మానవ రూపంలో జన్మించిన మహనీయుడని... ఆయన సేవా మార్గాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా పుట్టపర్తిలో జన్మించడం... తెలుగు ప్రజలు చేసుకున్న పుణ్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.తెలంగాణ సీఎంగా బాబా 100వ జయంతి ఉత్సవాల్లో పాల్గొనడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని...బాబా మనుషుల్లో దేవుడిని చూశారని ప్రేమతో అందరి మనసులను గెలుచుకుని... చిరస్మరనీయుడిగా నిలిచారని రేవంత్ తెలిపారు. ఉన్నతమైన చదువులతోనే జీవితాల్లో మార్పు వస్తుందని బాబా బలంగా నమ్మారని... అందుకే కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించి ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపారాని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు.ఈ సందర్భంగా ఏపీ రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ... రెండు తెలుగు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు సాగుతూ... అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే సత్య సాయి బాబా కోరుకున్న మెరుగైన సమాజం ఏర్పడుతుందన్నారు.

# జిల్లా అధ్యక్షునిగా రాజ్ ఠాకూర్ ను నియమించడం పట్ల కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు..



**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్23**
జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ రెండవసారి ఎన్నికైనందుకు ఆదివారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులు టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా నగర కాంగ్రెస్ అధ్యక్షులు బొంతల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ.. మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సామాన్య కార్యకర్త నుండి యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ లో క్రియాశీలక పాత్ర పోషించి స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి శిష్యునిగా షాప్ చైర్మన్ గా పనిచేసి అందరి మన్ననలు పొందడం జరిగిందన్నారు. 2023 సాధారణ ఎన్నికల్లో భారీ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలుపొంది అధిష్టానం తన సేవలను గుర్తించి జిల్లా అధ్యక్షునిగా రెండవసారి ఏఐసీసీ అవకాశం కల్పించడం జరిగింది. అధ్యక్ష పదవికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలువ లింగస్వామి, మహంకాళి స్వామి, రవికుమార్, దీ టి బాలరాజు, ముస్తఫా, గట్ల రమేష్, కొప్పుల శంకర్, చుక్కల శ్రీనివాస్, నాయిని ఓదెలు యాదవ్, ఆడెపు రవి, బుచ్చిరెడ్డి , దూళికట్ట సతీష్, గడ్డం శ్రీనివాస్, సన్నీ, పంజా శ్రీనివాస్, ఫజల్, దశరథం, బూర్ల శ్రీనివాస్, వంశీ, కుంటసది, నాగభూషణం గౌడ్, గుమ్మడి రవి, తో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ కార్యకర్తకు అండగా నిలిచిన వ్యాళ్ల హరీష్ రెడ్డి..


**-నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు భరోసాగా నిలుస్తా...**
**-వైద్య ఖర్చుల కు 10వేల రూ"లు ఆర్థిక సహాయం అందజేసిన విహెచ్ ఆర్ ఫౌండేషన్**



**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్23**
రామగుండం నియోజకవర్గంలోని కార్పొరేషన్ కార్పొరేషన్ పరిధి కెసిఆర్ కాలనీకి చెందిన గారెపల్లి సంతోష్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో( పక్షవాతం) బాధపడుతున్నారు. వైద్య చికిత్స కూడా డబ్బులు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడని విషయం తెలిసిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి ఆదివారం వైద్య ఖర్చుల నిమిత్తం ఆ కుటుంబానికి భరోసాగా పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తానని ఎలాంటి ఆపద వచ్చిన విహెచ్ ఆర్ ఫౌండేషన్ ద్వారా భరోసాగా నిలుస్తానని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలకు అన్నివేళలా అందుబాటులో ఉండి పనిచేస్తానని రాబోయే ఎన్నికలు ఏవి వచ్చిన కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనుముల కళావతి, పర్శ స్వాతి, అల్లి గణేష్, బూరుగు వంశీకృష్ణ, కొండా సురేష్,తదితరులు పాల్గొన్నారు.

# 42 శాతం రిజర్వేషన్లను అమలు చేశాకే ఎన్నికలు నిర్వహించాలి

**-బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డా.దాసరి అజయ్ కుమార్ యాదవ్**



**హైదరాబాద్, నవంబర్ 23 (అక్షర వేదం) :**
స్థానిక సంస్థల ఎన్నికలల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే హస్తం పార్టీనీ అంతం చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలల్లో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను కూడా బొంద పెట్టాలన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయకపోతే స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేయాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇయ్యాకపోతే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందన్నారు. 42 శాతం రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కపట నాటకాలు ఆడుతున్నాయని అన్నారు. బీసీలపైన అగ్రవర్ణ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 46ను రద్దు చేయాలన్నారు.

# ఐస్ బర్గ్ నూతన ఔట్ లెట్ ప్రారంభించిన తనికెళ్ళ భరణి



**హైదరాబాద్, నవంబర్ 23 (అక్షర వేదం) :**
దేశంలోనే మొట్ట మొదటి, ఏకైక ఆర్గానిక్ క్రీమరీ ఐస్ బర్గ్ ఆర్గానిక్ ఐస్ క్రీమ్స్ కంపెనీ కొత్త ఔట్ లెట్ ను సినీ నటుడు తనికెళ్ళ భరణి చేతులమీదుగా ఘనంగా ప్రారంభించినట్లు ఐస్ బర్గ్ ఆర్గానిక్ ఐస్ క్రీమ్స్ ఫౌండర్ సుహాస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేవలం ఆదాయాన్ని మాత్రమే చూడకుండా ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ చూపి ఐస్ బర్గ్ ఆర్గానిక్ ను అందుబాటులోకి తేవడం సంతోషకరమని సీనియర్ నటులు తనికెళ్ళ భరణి అభినందించి, మరిన్ని ఔట్ లెట్లు ప్రారంభించాలని ఆకాక్షించారని తెలిపారు. హైదరాబాద్ లో రాబోయే 2, 3 నెలల్లో మరిన్ని స్టోర్లు మొదలు పెడతామని, విజయవాడతో పాటు సౌత్ ఇండియా మొత్తం విస్తరించే ప్రణాళికతో ఉన్నట్టు తెలిపారు. కస్టమర్ల ఆదరణ తమపై ఎప్పటికీ ఇలాగే ఉండాలని కోరారు.

# వరంగల్ ట్రైసిటీ రన్నర్స్ కి అభినందనలు

**- మేడిపల్లి శాంతివనం రన్నర్స్ 21 కిలోమీటర్ (హాఫ్ మారతాను )పూర్తి**







**అక్షర వేదం/మేడ్చల్ మల్కాజ్గిరి/ మేడిపల్లి: బోడుప్పల్,నవంబర్ 23,**
తెలంగాణ రన్నర్స్ వరంగల్లో నిర్వహించిన వరంగల్ ట్రైసిటీ రన్స్లో రన్ లో బోడుప్పల్ మేడిపల్లి చెందిన శాంతివనం రన్నర్స్ 21 కిలోమీటర్ (హాఫ్ మారతాను )పూర్తి చేశారు. ఈ సందర్భంగా వారిని శాంతి వనం రన్నర్స్ పలువురు, మిత్రులు తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా శాంతివనం రన్నర్స్ మేడిపల్లి చెందిన వినోద రెడ్డి కీ మహిళా విభాగంలో రెండో స్థానం సాధించడం జరిగింది. ఈ సందర్భంగా శాంతి వనం రన్నర్స్ అభినందించారు. ఈ రన్ లో శాంతివనం రన్నర్స్ దుబ్బ కిషన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఇంటలిజెన్స్, వరదరాజులు న్యూట్రిషన్ డైటిస్ట్ , డాక్టర్ కట్ట శేఖర్ అసిస్టెంట్ ప్రొఫెసర్, నరసింహ నాయక్ ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు, రాజేష్ నాయక్ పోలీస్ కానిస్టేబుల్, ఉమా మహేష్ కెనరా బ్యాంక్ మేనేజర్ ఉమా మహేష్, సాయి కృష్ణ, వినోద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి కోకో పోటీలకు కోరుట్ల మైనారిటీ స్కూల్ విద్యార్థి ఎంపిక




**అక్షర వేదం కోరుట్ల నవంబర్ 23:** జడ్.పి.హెచ్.ఎస్ వెల్లులలో జరిగి న ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్ 17 కోకో పోటీలలో వి పార్థ సారథి ఎం ఈ సి ఫస్ట్ ఇయర్ జగి త్యాల జిల్లా తరఫున అత్యంత ప్ర తిభ కనబరిచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఎంపికయ్యాడు ఈ జట్టు నేటినుండి 25వ తేదీ వరకు యా దాద్రి భువనగిరిలో జరగబోయే రా ష్ట్రస్థాయి కోకో పోటీలకు పాల్గొన నున్నాడు పార్థసారథి ఎంపిక పట్ల మైనార్టీ స్కూల్ మరియు కాలేజ్ ప్రి న్సిపాల్ జి శంకర్ కోరుట్ల సీనియర్ ఆంగ్ల ఉపాధయులు ఖాజా మోహి యుద్దీన్ మరియు ఉపాధ్యాయ బృందం పీఈటి ఇ రాజేష్ కుమార్ ఆనందం వ్యక్తం చేశారు


# ప్రతాపగిరి శ్రీనివాసును పలకరించిన మేదరి సంఘ నాయకులు



**(అక్షర వేదం ప్రతినిధి, వరంగల్)** ప్రతాపగిరి శ్రీనివాసు అధ్యక్షులు, హనుమకొండ జిల్లా మేదరి మహేంద్ర గారి తల్లి ప్రతాపగిరి చంద్రమ్మ అనారోగ్య కారణాల వల్ల స్వర్గ స్థులైన ఈ సందర్భంగా... సరితా శ్రీనివాస్, వారి సోదరులు ప్రతాపగిరి సుదర్శన్, రవీందర్, ప్రభాకర్, గణపతి, కుటుంబ సభ్యులను కలసి పలకరించడం జరిగింది.వారిని కలసిన వారిలో జిల్లా ప్రధానకార్యదర్శి వలిపిరెడ్డిసుధీట్ కుమార్, జిల్లా ప్రచార కార్యదర్శి మస్న విజేందర్, మస్న కుమార స్వామి సూరత్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి సాంస్కృతిక విభాగం, కూచనపల్లి మహేందర్ ఉపాధ్యక్షులు రాష్ట్ర వెదురు పరిశ్రామిక సహకార సంఘం తదితరులున్నారు.

# ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కుశుభాకాంక్షలు

**- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కు శుభాకాంక్షలు తెలిపిన ఈస్ట్ బోడుప్పల్ యాదవ సంఘం సభ్యులు**






**అక్షర వేదం/మేడ్చల్ మల్కాజ్గిరి/ మేడిపల్లి: బోడుప్పల్,నవంబర్ 23,** ఇటీవలే జూబ్లీహిల్స్ నూతన ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా జూబ్లీహిల్స్ లోని వారి స్వగృహంలో ఈస్ట్ బోడుప్పల్ యాదవ సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛమించి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ యాదవ సామాజిక వర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలవడం మాకు ఎంతో సంతోషంగా ఉందన్నారు నవీన్ యాదవ్ ఇంకా ఎన్నో పదవులు అవరోదించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ బోడుప్పల్ అధ్యక్షుడు కొండ ఐలయ్య యాదవ్, జనరల్ సెక్రెటరీ సోమరాజు యాదవ్, మాజీ అధ్యక్షుడు అంజయ్య యాదవ్, మాజీ ఉపాధ్యక్షుడు నర్సింగ్ యాదవ్, వెంకన్న యాదవ్, రాజు యాదవ్, సాంబయ్య, మల్లికార్జున్, మురళీమోహన్, యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బైకు దొంగ అరెస్ట్..!



**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్23** రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని1టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మార్కండేయ కాలనీలో ఈ నెల 17 అర్ధరాత్రి జరిగిన బైకు దొంగతనం కేసులో సిఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై కే రమేష్, క్రైమ్ పార్టీ సిబ్బంది కేసును చేదించి ఆదివారం మందమర్రి కి చెందిన నిందితుడు చెరుకుల సాయిచరణ్ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. నిందితుడి నుండి దొంగిలించబడిన రాయల్ ఎన్ఫీల్డ్ బండిని రికవరీ చేసారు.

# ఘనంగా ఆర్ఎస్ ప్రవీణ్ కు మార్ జన్మదిన వేడుకలు



**అక్షర వేదం/జగిత్యాల నవంబర్ 23:** జగిత్యాల జిల్లా భీమారం మండ లం వెంకట్రావు పేట గ్రామంలో తన జీవితమంతా పేద పిల్లల అ భ్యున్నతికి బడుగు బలహీన వర్గా ల బాగు కోసం శ్రమిస్తున్న అభినవ అంబేద్కర్ సుప్రీమ్ తెలంగాణ రా ష్ట్ర మాజీ అడిషనల్ డీజీపీ డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ జన్మది నం వేడుకలను కేక్ కటింగ్ ఘనం గా కార్యక్రమం నిర్వహించడం జరి గింది ఈ కార్యక్రమం లో అంబేద్క ర్ సంఘం జిల్లా కన్వీనర్ బంగారు దీపక్ మాట్లాడుతూ తెలంగాణ రా ష్ట్ర అడిషనల్ డిజిపి ఆర్ఎస్ ప్రవీ ణ్ కుమార్ విధి నిర్వహణలో పేద మధ్యతరగతి పిల్లలకు అండగా ని లుస్తూ విలువలతో కూడిన అక్షర జ్ఞానాన్ని అందించారని ఎన్నో ఏళ్లు గా ఎవ్వరు చేయలేని గురుకుల వి ద్య వ్యవస్థను పటిష్టం చేసి పేద పి ల్లల అభ్యున్నతకు బంగారు బాట వేసిన ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ జ న్మదినం సందర్భంగా మా వెంకట్రా వుపేట గ్రామంలో ఘనంగా జరుపు కోవడం చాలా ఆనందంగా ఉందని అంబేద్కర్ సంఘం జిల్లా కన్వీనర్ బంగారు దీపక్ అన్నారు కార్యక్ర మంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ ప్రధా న కార్యదర్శి కట్ట శేఖర్ ,మల్లారెడ్డి, గుడిసెల రాజు ,ముదిగొండ మహే ష్, కానుగంటి రాజన్న,కర్రి లక్ష్మణ్, వెంకటేష్ ,సుధవేణి,చిన్నగంగరం, పిడుగు రాజిరెడ్డి, దేవుడు మల్ల య్య ,ఉదయ్ మరియు తదితరు లు పాల్గొన్నారు

# సింగరేణిలో 'అధికారుల ...రిలే నిరాహార దీక్షలు'



**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్23** సింగరేణి అధికారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నుండి అధికారుల రిలే నిరాహార దీక్షలు...సింగరేణి అధికారుల సమస్యల పరిష్కారం కై ఆదివారం గోదావరిఖనిలోని సిఎంఓఏఐ కార్యాలయంలో అధికారులు పెద్ది నర్సింహులు, పొనుగోటి శ్రీనివాస్ సెంట్రల్ జనరల్ సెక్రటరీ,& సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.అధికారుల వేతనాల్లో భాగమైన, పి అర్ పిబకాయిలు, గత రెండు సంవత్సరాలుగా చెల్లించని కారణముగా పలు రకాలుగా నిరసనలు చేపట్టామని, యాజమాన్యం నుండి ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల బకాయిలు వెంటనే చెల్లించాలని, బకాయిల చెల్లింపు లో జరుతున్న అసాధారణ ఆలస్యాన్ని నిరసిస్తూ, ఆందోళనతో రిలే నిరాహార దీక్షలు అన్ని ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయాల ముందు నిర్వహించుటకు నిర్ణయించారు. గతంలో14 రోజులు బ్లాక్ బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశామన్నారు. తదుపరి యాజమాన్యానికి, ఈ నెల 9న నోటీసు ఇచ్చినప్పటికీ, ఈ విషయం లో పురోగతి లేనందువల్ల ఆందోళనలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో బి.మల్లేష్, కె.వెంకటేశ్వర్ రెడ్డి, పంతుల, సంజీవ్ లు, ఆర్జీ-1, ఎస్ఆర్పీ, ఆర్జీ-2, ఎస్టిపిపి ఏరియాల అధ్యక్షుల తోపాటు కె.మల్లేష్, పెరుమాళ్ళ శ్రీనివాస్, అంజయ్య, జక్కారెడ్డి,శ్రీనివాస్(ఎస్టిపిపి) లు పాల్గొనగా ఆన్ లైన్లో టీ.లక్ష్మీపతి గౌడ్ సెంట్రల్ ప్రెసిడెంట్, వెంకటాచారి, నర్సింహ్మ రావు,యస్.రమేష్, శివ ప్రసాద్, కోలా శ్రీనివాస్, మదన్ నాయక్, చిల్క.శ్రీనివాస్ లు, కార్పొరేట్, కొత్తగూడెం, భూపాలపల్లి, మందమర్రి, ఇల్లందు, అర్జీ-3, మణుగూరు, బెల్లంపల్లి ఏరియాల అధ్యక్ష కార్యదర్శులు ఇతర ప్రతినిధులు పాల్గొని,ఈ మేరకు తీర్మానించారు. ఇది ఈ నెల 30 తారీకు వరకు కొనసాగించి, అప్పటికి ఏ నిర్ణయం రానిచో, డిసెంబర్ 1 తారీకు నుండి నోటిస్ లో తెలియజేసినట్టుగా, వర్క్ టు రూల్లి చేపట్టనున్నట్లు తెలిపారు.

# సర్పంచ్ రిజర్వేషనల్లలో మహా ముత్తారం బీసీలకు అన్యాయం

**-బిజెపి మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్**




**అక్షర వేదం/మహాముత్తారం, నవంబర్ 23:** రాబోవు స్థానిక సర్పంచ్ ఎన్నికల రిజర్వేషన్లలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహాముత్తారం మండలం లోని బీసీ సమాజానికి అన్యాయం చేసింది అని అన్నారు.24 గ్రామ పంచాయతీలు ఉన్న మా మహాముతారం మండలం లో బీసీల ఓటు శాతం మొత్తం శూన్యం ఉన్నట్లు బీసీ రిజర్వేషను ఒక్క గ్రామ పంచాయతీకి కూడా కేటాయించకుండ బీసీ రిజర్వేషను 0 గా ప్రకటించి బీసీ నినాదం తుంగలో తొక్కారు అని వారు అన్నారు. మొన్న బీసీలకు జిందాబాద్ కొట్టి, మా బీజేపీ పార్టీ బీసీ రిజర్వేషను కి వ్యతిరేకం అని మహాముతారం మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు కదా.... మరి ఇప్పుడు బీసీ లకు 0 రిజర్వేషను ఇచ్చిన మీ ప్రభుత్వం నీ ఏమి చేస్తారు??? అని ప్రశ్నించారు. రేపు అదే మండల కేంద్రంలో బీసీల రిజర్వేషన్ల కోసం మండల బీజేపీ పార్టీ పోరాటానికి సిద్ధంగా ఉంది... మరి మండల కాంగ్రెస్ నాయకులు సిద్ధమా??? అని సవాలు విసిరారు. బీసీల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే వెంటనే మీ ప్రభుత్వం చేత బీసీలకు న్యాయ పరమైన రిజర్వేషను కేటాయించేలా మీ ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకోవాలని వారు అన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ రిజర్వేషన్ లో మార్పు తీసుకుని మా మహాముతారం మండలం కి బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. బీసీలకు ఎల్లప్పుడూ బీజేపీ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాబోవు కాలంలో బీసీ తీసుకునే నిర్ణయాన్ని బీజేపీ పార్టీ కట్టుబడి ఉంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి డాక్టర్. రఫీ , ఉపాధ్యక్షుడు లింగమల్ల సడువలి రావు, మండల కోశాధికారి నితిన్, బీజేవైఎం మండల అధ్యక్షుడు నవీన్ నాయక్, బీజేవైఎం కార్యదర్శి ప్రతాప్, రాజు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ సేవలు వినియోగించుకోండి...

**- సమస్యల పరిష్కారానికి నగర ప్రజలు కాల్ సెంటర్ ఆన్లైన్ సేవలు సద్వినియోగం చేసుకోండి: నగర కమిషనర్ జె అరుణశ్రీ**




**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్ 23** మున్సిపల్ సేవలకు సంబంధించి తమ సమస్యలు పరిష్కరించు కోవడానికి నగర ప్రజలు కాల్ సెంటర్ , ఆన్ లైన్ సదు పాయాలను ఉపయోగించుకోవాలని అదనపు కలెక్టర్, రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పారిశుద్ధ్యం , రోడ్లు , కాలువల సమస్యలు , నీటి సరఫరా , వీధి దీపాలు వెలగకపోవడం , తదితర అన్ని మున్సిపల్ సేవలకు సంబంధించి ప్రజలు కార్యాలయానికి వచ్చి ధరఖాస్తు సమర్పించవలసిన అవసరం లేకుండా కాల్ సెంటర్ , ఆన్ లైన్ లో తమ ఫిర్యాదులను నమోదు చేయడంతో పాటు పరిష్కార స్థితిని కూడా తెలుసుకునే సౌలభ్యం ఉందని అన్నారు. స్మార్ట్ ఫోన్ ఉన్న వారు ప్లే స్టోర్ నుండి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ "సిటిజెన్ బడ్డీ యాప్ " డౌన్ లోడ్ చేసుకొని అందులో ఫిర్యాదు నమోదు చేయవచ్చని అలాగే వెబ్ సైట్ htpp:// egovindia.in లోని గ్రీవెన్స్ పేజీ లో కూడా తమ ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. టోల్ ఫ్రీ ఫోన్ నెంబర్ 14420 కు ఫోన్ చేయడం ద్వారా కూడా ఫిర్యాదు నమోదు చేసుకునే సౌలభ్యం ఉన్నదని, అంతేకాకుండా రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయం లోని కాల్ సెంటర్ కు నేరుగా టోల్ ఫ్రీ నెంబర్ 18004257062, 1800 4258 927 లకు లేదా ఫోన్ నెం . 960 3666444 , 9392483959 ( కంట్రోల్ రూమ్ ) లకు కు ఫోన్ చేస్తే ఫిర్యాదు స్వీకరించి నమోదు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని మెరుగైన మున్సిపల్ సేవలను పొందాలని అమె కోరారు.

# మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తోటకూర వజ్రేష్ యాదవ్

**- వజ్రెష్ యాదవ్ ని కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఈస్ట్ బోడుప్పల్ యాదవ సంఘం.**





**అక్షర వేదం/మేడ్చల్ మల్కాజ్గిరి/మేడిపల్లి: బోడుప్పల్,నవంబర్ 23,** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తోటకూర వజ్రేష్ యాదవ్ ఎన్నికైన సందర్భంగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఈస్ట్ బోడుప్పల్ యాదవ సంఘం సభ్యులు బోడుప్పల్లోని స్వగృహమున కలసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తోటకూర వజ్రేష్ యాదవ్ నాయకత్వంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని, పార్టీ కార్యకలాపాలు ప్రజలకు మరింత చేరువవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ బోడుప్పల్ యాదవ సంఘం అధ్యక్షుడు కొండ ఐలయ్య, గౌరవాధ్యక్షుడు అంజయ్య యాదవ్, మాజీ అధ్యక్షుడు నర్సింగ్ యాదవ్, వెంకన్న యాదవ్, రాజు యాదవ్, సాయి యాదవ్, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టులంతా ఏకం కావాలి

**-డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ వంద సంవత్సరాల ఉత్సవాలను జయప్రదం చేయండి.**
**-ఖని కార్మిక కుటుంబాల సమ్మేళనంలో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని.**





**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్ 23**
భారతదేశంలో సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని అదేవిధంగా దేశంలో వంద సంవత్సరాలుగా ఉన్న ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు .ఆదివారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి), అర్జీ వన్ బ్రాంచి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్మిక కుటుంబాల సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.. మావోయిస్టులు ఆయుదాలను వదిలి జనజీవన స్రవంతి లోకి వచ్చి కమ్యూనిస్టుల పునరేకేకరణకు కృషి చేయాలని కోరారు.బిజెపి ప్రభుత్వం ఆపరేషన్ కాగార్ ను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఆపరేషన్ కగారు పేరుతో వందలాది మందిని చంపుతున్న సుప్రీంకోర్టు సుమోటోగా కేసును స్వీకరించడం లేదని అన్నారు. దేశంలో బడుగు బలహీన వర్గాలు పేద ప్రజల అభ్యున్నతికి వంద సంవత్సరాలుగా పోరాడుతున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. సింగరేణిలో 1942లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ని ఏర్పాటు చేసి అనేక కార్మిక హక్కుల కోసం ఎఐటియుసి పోరాటాలు నిర్వహించిందని అన్నారు. శేషగిరిరావు, మఖ్దూం మోహియోద్దీన్ , సర్వదేవబట్ల రామనాథం, నల్లమల్ల గిరి ప్రసాద్, మనుబోతుల కొమరయ్య, విఠల్ రావు లాంటి తెలంగాణ సాయుధ పోరాట యోధులు యూనియన్ ను స్థాపించి కార్మిక హక్కుల కోసం నిరంతరం కృషి చేశారని, కామ్రేడ్ భాస్కరరావు, కత్తుల కొమురయ్య, చంద దుర్గయ్య, పి. నరసయ్య, వి.టి. అబ్రహం లాంటి కార్మిక నాయకులు ప్రాణ త్యాగం చేశారని, త్యాగాల చరిత్ర కలిగిన యూనియన్ ఎఐటియుసి తప్ప మరొకటి లేదని ఆయన తెలిపారు. యూనియన్ శ్రేణులంతా పార్టీలో మమేకమై రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి సత్తా చాటాలని పిలుపునిచ్చారు బిజెపి లాంటి మతోన్మాద పార్టీలు మతోన్మాదాన్ని ముందు పెట్టి అభ్యుదయ వాదులందరినీ లేకుండా చేస్తుందని బిజెపి అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని ఆయన అన్నారు గోదావరిఖనిలో వంద కుటుంబాలకు సన్మానం చేసి కమ్యూనిస్టు కుటుంబాలుగా తీర్చిదిద్దిన స్థానిక నేతలను ఆయన అభినందించారు. రాబోయే కాలంలో కమ్యూనిస్టు పార్టీని పారిశ్రామిక ప్రాంతంలో బలోపేతం చేయాలని అందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లు మాట్లాడుతూ కార్మికులు అనుభవిస్తున్న ప్రతి హక్కు ఎఐటియుసి మాత్రమే సాధించిందని మరిన్ని కార్మికుల హక్కుల సాధన నిరంతరం కృషి చేస్తుందని వారు తెలిపారు. అదేవిధంగా సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మాట్లాడుతూ సిపిఐ వంద సంవత్సరాల ముగింపు ఉత్సవాలకు దేశ వ్యాప్తంగానే కాకుండా 42 దేశాల నుంచి ప్రతినిధులు హాజరు కానున్నారని ఆయన తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఎగిరే జండా ఎర్ర జెండా మాత్రమేనని సుదీర్ఘ త్యాగాలు కలిగిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని తెలిపారు. అదేవిధంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ మాట్లాడుతూ.. సింగరేణి లో వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగ రీత్యా గోదావరిఖని కి వచ్చి స్థిరపడ్డ కార్మిక కుటుంబాల ఐక్యత కోసం ఒకే వేదికపైకి తీసుకురావడం సంతోషకరంగా ఉందని, ఇంట్లో ఉన్న మహిళల ప్రోత్సాహంతోనే వివిధ రంగాల్లో పురుషులు రాణిస్తున్నారని, మగ వారితో పాటు ఆడవారు కూడా పార్టీ, యూనియన్ అభ్యున్నతికి కృషి చేయాలని ఆయన కోరారు. ఎన్నడు లేని విధంగా ఇంత పెద్ద ఎత్తున కార్మిక కుటుంబాలకు చెందిన మహిళలు ఈ సమ్మేళనంలో పాల్గొనడాన్ని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) అర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు ఎల్ ప్రకాష్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, నాయకులు గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, కె.కనకరాజు, కన్నం లక్ష్మి నారాయణ, కందుకూరి రాజారత్నం, మోటపలుకుల రమేశ్, రంగు శ్రీను, మడికొండ ఓదెమ్మ, ఆసాల రమ, విజయలక్ష్మి, ప్రీతం, సూర్య, ఎం.ఎ.గౌస్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి కళాకారులు ఎజ్జ రాజయ్య, డప్పు రాజు, జూల మోహన్ తదితరులు విప్లవ గేయాలు ఆలపించారు.


# బాధ్యతలు చేపట్టిన డీసీపీ భూక్యా రామ్ రెడ్డి

**- స్వాగతం పలికిన పోలీస్ అధికారులు..**



**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్23**
రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్ నూతన డీసీపీగా భూక్యా రామ్ రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. డీసీపి పుల్ల కరుణాకర్ స్థానంలో సీఐడీ విభాగం లో ఎస్పీ గా పనిచేస్తున్న భూక్యా రామ్ రెడ్డి ఐపిఎస్, డీసీపీ గా నియమితులయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సిరిసిల్ల లోని గర్జనపల్లి కి చెందిన ఆయన 1989 బ్యాచ్ ఎస్ఐ గా పోలీస్ శాఖలో చేరి అంచలంచలుగా ఎదిగి 2020 లో ఐపీఎస్ హెూదా సాధించారు. డీసీపీ మాట్లాడుతూ...ప్రజల భద్రత, శాంతి భద్రతా పరిరక్షణ, మహిళా, శిశు రక్షణ, సైబర్ నేరాల నియంత్రణ, యువతలో నేర ప్రవృత్తుల నివారణ, కమ్యూనిటీ పోలీసింగ్ వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకొని, ప్రతి పోలీసు సిబ్బంది సహకారంతో సమర్థవంతమైన పోలీసింగ్ ప్రజలకు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని, ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్ లలో, సీఐ ల వద్ద, ఏసీపీ లను సంప్రదించాలని, సమస్య పరిష్కారం కాకపోతే డీసీపీ ఆఫీసు కు రావాలని అన్నారు. ప్రభుత్వ పాలసీకి వ్యతిరేకంగా చేసే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని, గంజాయి సేవించేవారిని మరియు నిషేదిత మత్తు పదార్థాలు అక్రమ రవాణా, సరఫరా, నిల్వ చేయడం వంటి వాటిని ఉక్కుపాదంతో అణిచివేస్తామని తెలిపారు. ఏదైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం ఉంటే ఫోన్లో నేరుగా సంప్రదించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# చండూరు మండల టి.పి.యు.ఎస్. నూతన కమిటీ ఎన్నిక



**చండూర్**
**నవంబర్ 23 అక్షరవేదం**
తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టిపియూఎస్) చండూరు మండల నూతన కమిటీ ఆదివారం చండూరులో ఏకగ్రీవంగా ఎంపికయింది. చండూరు ఉన్నత పాఠశాలకు చెందిన బావండ్ల వీరేశం అధ్యక్షులుగా, పిఎస్ కొటాయిగూడెం నకు చెందిన పిట్టల బాలస్వామి ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పట్ల రాష్ట్ర కమిటీ ఆదేశాలకు సహకరిస్తామని, ఉపాధ్యాయులకు ఆరోగ్య కార్డులు, డిఏలు, పిఆర్సీల సాధనలో భాగంగా ఉద్యమిస్తామని వారు ప్రకటించారు. మండల ఉపాధ్యాయులు కిషన్ ప్రసాద్, సుధీర్ బాబు, గంట వెంకటేశం, రాపోలు యాదగిరి, మారయ్య, శ్రవణ్ కుమార్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

# లేబర్ కోడ్స్ అమలుపై ఖనిలో అవగాహన సదస్సు




**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్ 23**
కేంద్ర అమలు చేసిన నాలుగు లేబర్ కోడ్స్ పై అవగాహన కార్యక్రమం ఇటీవల అమలు చేసిన నాలుగు లేబర్ కోడ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఎలక్ట్రికల్ రాజ్ కుమార్, డిప్యూటి డైరెక్టర్ ఆఫ్ సేఫ్టీ మైనింగ్ ప్రేమ్ కుమార్, డిప్యూటి డైరెక్టర్ ఆఫ్ సేఫ్టీ మెకానికల్ వివిధ యూనియన్ ప్రతినిదులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్స్, మహిళా ఉద్యోగులతో అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఉన్న 29 చట్టాలను కొత్త నాలుగు లేబర్ కోడ్స్ గా తేది 21నవంబర్ నుండి అమలు పై అవగాహన కార్యక్రమం ద్వారా అందరికీ ఉపయోగకరమైన మార్గదర్శకాలు లభిస్తాయని అన్నారు. కార్మికుల సంక్షేమం, హక్కులు, భద్రత, వేతన నిర్మాణం, పారదర్శక ఉద్యోగ వ్యవస్థ కోసం, కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఈ కొత్త కోడ్స్ సరిగ్గా అర్థం చేసుకుని అమలు చేయడం అత్యంత అవసరం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎంఎస్ మినహా అన్ని సంఘాలు కొత్త లేబర్ కోడ్స్ అమలును వ్యతిరేకించాయి. ఆర్జీ.1, ఆర్జీ.2, ఆర్జీ.3, అధికారులు, ఉద్యోగులు, యునియన్ నాయకులు (ఎ.ఐ.టి.యు.సి, ఐ.యన్.టి.యు.సి, టి.జిబికేయస్, సి.ఐ.టి.యు, బి.యం.యస్, జి.యల్.బి.కే.యస్), సి.యం.ఓ.ఐ.ఏ, కాంట్రాక్ట్ సిబ్బంది, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# వ్యవసాయ విస్తరణ అధికారుల నూతన కార్యవర్గం



**మంచిర్యాల, నవంబర్23 అక్షరవేదం**
మంచిర్యాల జిల్లా తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల నూతన కార్యవర్గాన్ని మంచిర్యాల జిల్లా టీఎన్జీవో అధ్యక్షులు శ్రీహరి అధ్యక్షతన ఎన్నికల నిర్వహణ కొనసాగింది. మంచిర్యాల జిల్లా టిఎఈఓ జిల్లా అధ్యక్షునిగా ఉప్పులేటి శంకర్. ప్రధాన కార్యదర్శిగా ఆగిడి రామచందర్ నెన్నెల్ ,కోశాధికారిగా రాజశేఖర్ చెన్నూర్ అలాగే గౌరవ అధ్యక్షులుగా ఎస్ కనకరాజు. కొమురయ్య వైస్ ప్రెసిడెంట్ 1,2,3 సాయిని శ్రీనివాస్ , వినోద్ కుమార్ భీమిని, త్రి సంధ్య జనరల్ సెక్రటరీ 1,2 వసుధ ఆఫ్రోజ్ భీమిని లను ఎన్నుకోవడంతో పాటు ఈసీ మెంబర్లను కూడా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ. డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రసాద్. రాజా నరేందర్ బెల్లంపల్లి, క్రిష్ణ హాజరయ్యారు ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా టిఏఈఓ మాజీ అధ్యక్షులు ముత్యం తిరుపతి మాజీ ప్రధాన కార్యదర్శి చొప్పదండి తిరుపతి హాజరయ్యారు

# మంథని నియోజకవర్గంలో మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభం



**అక్షర వేదం/మంథని,నవంబర్23:**
మంథని మండలంలోని ఎగ్లాస్ పూర్ గ్రామంలో సోమవారం రోజున ఉదయం ఏడు గంటలకు రైతు వేదిక వద్ద ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఐటీ,పరిశ్రమలశాఖ మంత్రి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రారంభిస్తారు.మంత్రి ఆదేశాల మేరకు వయాట్రీస్ సౌజన్యంతో 850 కుట్టు మిషన్లతో, డిఆర్డిఏ వారి ఆధ్వర్యంలో 21 ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలు,అలాగే గుంజపడుగు, సూరయ్య పల్లి,గద్దలపల్లి, గోపాల్ పూర్, వెంకటాపూర్, చిల్లపల్లి, నాగారం, గాజులపల్లి, ఎక్లాస్పూర్ ముత్తారం మండలం ముత్తారం, అడవి శ్రీరాంపూర్, ఓడేడు,రామగిరి మండలం కల్వచర్ల, బేగంపేట్, సుందిళ్ల,కమాన్పూర్, జూలపల్లి,రొంపి కుంట, పాలకుర్తి రానాపూర్ సెంటర్లలో ప్రభుత్వ రైతు వేదికల్లో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలు ప్రారంభం చేస్తారు.ఉదయం 7:30 నిమిషాలకు మంథని ప్రభుత్వ వైద్యశాలలో సిహెచ్సిలో 12 లక్షలతో స్కానింగ్ మిషన్,2 లక్షలతో ఆర్వో వాటర్ ప్లాంట్, 1లక్షతో న్యూ ఓపి రూమ్,4లక్షలతో పేషంట్ వెయిటింగ్ హాల్,ఒక లక్షతో చిన్నపిల్లల వార్మర్స్ ను ప్రారంభోత్సవం చేయనున్నారు. ఉదయం 11:00 గంటలకు పెద్దపల్లి జిల్లాలోని మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను స్వరూప గార్డెన్ లో మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరుగుతుంది..



# అది చాలెంజ్‌తో కూడుకున్న పని..

## హాట్ టాపిక్‌గా కీర్తిసురేశ్ కామెంట్స్

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ కీర్తిసురేశ్. మహానటి సినిమాతో నేషనల్ అవార్డు అందుకున్న ఈ భామ తమిళం, తెలుగుతోపాటు పలు ప్రధాన భారతీయ భాషల్లో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది. పక్కా ప్రొఫెషనల్‌గా ఉండే ఈ బ్యూటీ ఫిట్‌నెస్‌పై కూడా మంచి ఫోకస్ పెడుతుందని తెలిసిందే. ఈ ముద్దుగుమ్మ ఓ విషయంలో ఇప్పటికీ ఫైట్ చేస్తుందట. ఇంతకీ ఏమిటా విషయమనుకుంటున్నారా..? కీర్తిసురేశ్ మంచి ఫుడ్ లవర్. ఈ విషయంలో ఇబ్బంది పడుతుందట. ఓ చిట్ చాట్‌లో ఇదే విషయమై కీర్తిసురేశ్ మాట్లాడుతూ.. ఫుడ్‌పై నాకున్న ఇష్టాన్ని నియంత్రించుకునే విషయంలో నేనిప్పటికీ నాతో నేనే ఫైట్ చేస్తుంటానని.. కఠినమైన డైట్‌ను ఫాలో అవడం తనకు చాలెంజ్‌తో కూడుకున్న పని అని చెప్పింది కీర్తిసురేశ్.మొత్తానికి ఓ వైపు ఫుడ్ విషయంలో బ్యాలెన్స్ తప్పుతున్న ఫిజిక్ మెయింటైన్ చేయడంలో మాత్రం కీర్తిసురేశ్ కాంప్రమైజ్ అవడం లేదని ఈ బ్యూటీ లుక్స్ చూస్తే తెలిసిపోతుంది. ఫిట్‌నెస్ జర్నీ విషయంలో తన అభిమానులకు స్ఫూర్తిగా నిలిచే కీర్తిసురేశ్ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. కీర్తిసురేశ్ ప్రస్తుతం తమిళంలో రివాల్వర్ రీటా సినిమాతోపాటు సినిమాలో నటిస్తుంది.

# దగ దగా మెరిసిపోతున్న బ్యూటీ రాశి ఖన్నా !

ఊహలు గుస గుసలాడే సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయమైన బ్యూటీ రాశి ఖన్నా, అమ్మడు మొదటి సినిమాతోనే సూపర్ హిట్ అందుకోవడమే కాకుండా, యూత్‌లో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది.ఈ మూవీలో ఈ అమ్మడు నటనకు, అందానికి ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. దీంతో ఈ సినిమా తర్వాత ఈ చిన్నదానికి వరసగా అవకాశాలు తలుపు తట్టాయి. చాలా సినిమాల్లో ఛాన్స్‌లు రావడంతో, స్టార్ హీరోల సరసన నటించి మెప్పించింది.ఈ ముద్దుగుమ్మ ఊహల గుసగుసలాడే సినిమా తర్వాత జోరు, జిల్, బెంగాల్ టైగర్, శివం, సుప్రీ, హైపర్, జై లవకుశ, రాజా దిగ్రేట్, ఆక్సిజన్, టచ్ చేసి చూడు, తొలి ప్రేమ,ప్రతి రోజూ పండుగే, వెంకీ మామ,వరల్డ్ ఫేమస్ లవ్, తిరు, పక్కా కమర్షియల్ ఇలా చాలా సినిమాల్లో నటించి మెప్పించింది.ఇక ఈ మధ్య ఈ అమ్మడుకు తెలుగులో కొంత వరకు అవకాశాలు తగ్గాయి. అందువలన కాస్త బ్రేక్ ఇచ్చిన ఈ చిన్నది, సిద్ధు జొన్నల గడ్డ సరసన తెలుసు కదా మూవీతో ఎంట్రీ ఇచ్చి తన నటనతో మరోసారి అభిమానుల హృదయాలను గెలుచుకుంది. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద పాజిటివ్ టాక్‌తో దూసుకెళు ్తంది.ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ, తాజాగా బంగారపు రంగు చీరలో బంగారంలా మెరిసిపోతూ తన అంద చందాలతో అందరి మనసు దోచేసుకుంటుంది.




# ఏం అందం రా బాబు..

## చూపుతోనే ఆగం చేస్తుందిగా..



ఎబ్యూటీ మీనాక్షి చౌదరి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. తన అందంతో, గ్లామర్‌తో ఎంతో మందిని ఆకట్టుకుంది ఈ అమ్మడు.ఇచ్చట వాహనములు నిలుపరాదు అనే సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి. అయితే ఈ అమ్మడు మొదటి సినిమా అంతగా హిట్ అవ్వకపోయినప్పటికీ, ఈ బ్యూటీకి మాత్రం మంచి క్రేజ్ వచ్చింది. దీంతో అడవి శేష్ హిట్ 2 మూవీలో ఛాన్స్ కొట్టేసింది. ఇక ఈ మూవీతో ఈ అమ్మ డుకు వరసగా అవకాశాలు దక్కాయి.ఇక ఈ సినిమా తర్వాత గుంటూరు కారం, లక్కీ భాస్కర్ , సంక్రాంతికి వస్తున్నాం వంటి సినిమాల్లో నటించి మెప్పించింది. ముఖ్యంగా సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో వెంకటేష్ గర్ల్ ఫ్రెండ్‌గా నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది.ఇక ఈ మూవీ తర్వాత అమ్మడుకు వరసగా అవకాశాలు వస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో ప్రస్తుతం ఈ చిన్నది వరసగా సినిమాలు చేస్తూ, ఫుల్ బిజీ అయిపోయింది.ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ అమ్మడు తాజాగా పింక్ డ్రెస్‌లో తన అంద చందాలతో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. మరి మీరు కూడా ఆ ఫొటోస్ చూసెయ్యండి.




# ప్రభాస్ 'ది రాజాసాబ్' నుంచి 'రెబల్' సాంగ్ ప్రోమో రిలీజ్

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ది రాజా సాబ్' సినిమాకు సంబంధించిన కీలక అప్‌డేట్ విడుదలైంది. హారర్ చిత్రాల దర్శకుడు మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ మాస్ ఎంటర్‌టైనర్ 'ది రాజా సాబ్' నుంచి మొట్టమొదటి పాట విడుదల తేదీని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ మూవీ ఫస్ట్ సింగిల్ రెబల్ సాబ్ ను నవంబర్ 23న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా ఈ పాటకు సంబంధించిన ప్రోమోను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తుండగా.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, జరీనా వాహాబ్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తుండగా బోమన్ ఇరానీ, సంజయ్ దత్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు.